రచన - డిసెంబరు 2002

# ఖండిత కనిష్ఠిక

వెంకట్రావుడికి ఏదీ కలిసి రాలేదు. ఓ దశాబ్దన్నరకాలంలో చేపట్టిన ప్రతిపనీ ధ్వంసమవుతూ వచ్చింది. చేసిన ప్రతి వ్యాపారమూ నష్టానికి దారి తీసింది. ఇద్దరు జామాతలూ, వెంకట్రావుడు చేసే ప్రతి వ్యాపారంలోనూ పెట్టుబడి లేకుండా వాటాలడిగి, వాటాలకీ కూతుళ్ళ జీవితాలకీ ముడిపెట్టేసి చాలా సతాయించారు. వాళ్ళ జోక్యంతో జయంగా నడవవలసిన కొన్ని వ్యాపారాలు దెబ్బతినేశాయి. ఈడొచ్చిన కొడుకులిద్దరూ ఏవో డిగ్రీలు సంపాదించినా, సంపాదించే ఆసక్తి లేకపోవడంతో ఖర్చుకే అలవాటుపడ్డారు కాని, బాధ్యతలు చేపట్టలేదు. వయసు తొందర మూలాన వివాహాలు చేసుకొన్నారుకాని, తమ కాళ్ళ మీద నిలబడి తమ సంసారాన్ని నడిపించే ప్రయత్నాలు చెయ్యలేదు.

ఊరి బయట కాలువగట్టునున్న రావిచెట్టు తిన్నెమీద కూర్చుని ఆలోచనల్లోపడ్డ వెంకట్రావుడు, ఎవరో పలకరించినట్లనిపించి ఈ లోకంలోపడ్డాడు. ఎదురుగా శ్వేతవస్త్రధారియైన ఓవృద్ధుడు నిలబడి ఉన్నాడు. "జీవితంలో దెబ్బ మీద దెబ్బ తింటున్నావు. అప్పుల్లో కూరుకుపోతున్నావు. నువ్వు చెయ్యని పూజ లేదు. మొక్కని దేముడు లేదు. వాస్తుపేరిట నీ భవనానికి చేయించని మార్పు లేదు. కొడుకులు కలిసి రాలేదు. అల్లుళ్ళు కాల్చుకు తింటున్నారు. చేసిన అప్పులు తీర్చాలి. ఉన్న ఆస్తుల్ని కాపాడుకోవాలి. ఓదార్చడానికి భార్య బ్రతికిలేదు. అవునా?" – ఆ వృద్ధుడు వెంకట్రావుడి పరిస్థితిని క్లుప్తంగా చెప్పి, చివరగా ప్రశ్నించాడు.

వెంకట్రావుడు ఒకింత ఆశ్చర్యపోతూ నమస్కారం పెట్టి "అవును స్వామీ!" అన్నాడు.

"నేను చెప్పినట్టు చెయ్యి, నువ్వు బాగుపడ్తావు. వెంటనే ఉన్న ఆస్తినంతా నీ భవనంతోసహా అమ్మి అప్పులు తీర్చు. అన్ని వ్యాపారాల్నీ మూసిపారేసి, నీ దగ్గర ఓ వెయ్యి రూపాయలు మాత్రమే ఉంచుకొని, మిగిలిందంతా నీ కూతుళ్ళకీ, కొడుకులకీ సమానంగా యిచ్చి పారేసి, వాళ్ళని తన్నితగలెయ్! యిదంతా చేసి యిక్కడకురా, అప్పుడు నీ జీవితం నేను బాగు చేస్తాను, ఏమంటావ్?"

"కష్టతరమైన ఆచరణని చాలా సులువుగా మూడు ముక్కల్లో చెప్పేశారు! అయినా మీ మాటల్లో నాకెందుకో గురి కలుగుతోంది. మీరు చెప్పిన విధంగా చేసి, సంసార బంధనాల్ని తెంచుకొని సన్యాసం స్వీకరించినా, జీవితం ప్రశాంతంగా గడిచిపోతుందనుకొంటాను. ఈ విధంగా ఆలోచించినా మీ మాటల్లో సబబువుందనిపిస్తోంది. అలాగే చేసి, వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను. తమరెక్కడుంటారు స్వామీ?" – తక్షణ నిర్ణయం తీసుకుని వెంకట్రావుడు ప్రశ్నించాడు.

"ఈ దగ్గర్లోనే ఉంటాను. నువ్విక్కడకు రాగానే నాకు కనిపిస్తావు. అప్పుడు నేనే వచ్చి నిన్ను పలకరిస్తాను. బయలుదేరి వెళ్ళు" అన్నాడు వృద్ధుడు.

వెంకట్రావుడు లేచి నిల్చుని, ఆ వృద్ధునికి మరోసారి నమస్కారం చేసి ఊరి వైపు అడుగులు వేశాడు. వెంకట్రావుడు కను చూపు మేర దాటగానే వృద్ధుడు నడుచుకుంటూ వెళ్ళి రావిచెట్టు కెదురుగా కాస్త దూరంలో ఉన్న తులసికోటలో కలిసిపోయాడు.

వెంకట్రావుడు తన వ్యవహారాలన్నీ తెగతెంపులు చేసుకొనేసరికి రెండునెలలు పైగానే పట్టింది. కుటుంబ సభ్యులందరూ మొదటిసారిగా కళ్ళు తెరిచి గాభరా పడసాగారు. వాళ్ళందర్నీ మొదట్లోనే అదుపులో ఉంచనితప్పు తెలిసొచ్చింది. వృద్ధుడు చెప్పినట్టుగా ఓ వెయ్యిరూపాయలు దగ్గరుంచుకొని, ఓ సంచీలో రెండు జతల బట్టలు వేసుకొని కాలువ గట్టుకి దారితీశాడు.

వృద్ధుడు వెంకట్రావుడు కోసం ఎదురు చూస్తున్నాడు. "అన్నమాట ప్రకారం వచ్చావు. సంతోషం! ఎదురుగా ఉన్న ఆ తాటాకుల పాకలో ఈ రాత్రికి ఉండు. అందులో పడుకోడానికి నులక మంచం ఉంది. ఇప్పుడు నువ్వు వెనక్కి ఊళ్ళోకి వెళ్ళి ఓ చిన్న మేకపిల్లనీ, కావిరంగు పంచెనీ, కండువానీ, దండిగా నాలుగైదురకాల ఫలాల్ని కొనుక్కురా. ఎందుకైనా మంచిది, చివరిసారిగా కడుపునిండా భోంచేసిరా!" అన్నాడు.

వెంకట్రావుడు వృద్ధుడు చెప్పినట్టే చేసి, బ్యాటరీలైట్ వెల్తుర్తో దారి చూసుకుంటూ కాలువగట్టు చేరాడు. కూడా తీసుకువచ్చిన మేకపిల్లని పాకరాటకి కట్టి, పాకలో ప్రవేశించి నులక మంచం మీద నడుం వాల్చాడు. చాలా రోజుల తర్వాత వెంకట్రావుడికి గాఢనిద్ర పట్టింది.

వెంకట్రావుడు ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకొనేసరికి వృద్ధుడు వచ్చాడు. "ఈ రోజల్లా నీకు ఫలాలే ఆహారం, సాయంత్రానికి అమావాస్య వస్తుంది. అదుగో, ఆ రాటకి వేలాడుతున్న లాంతర్ని శుభ్రం చెయ్యి. ఆ కర్ర తొట్టిలో ఉన్న సీసాలో కిర్సనాయిలుంది. దాంతో లాంతర్ని నింపు" అన్నాడు.

"ఈ పాక....?" వెంకట్రావుడు అర్థోక్తిగా ఆగిపోయాడు.

"నా స్నేహితుల తాలూకుదే. ప్రస్తుత యజమాని కాళీ దర్శనానికని కలకత్తా, అదే కోల్‌కతా వెళ్ళాడు. నేను చీకటి పడ్డాక వస్తాను. అంతవరకూ నిశ్చింతగా ఉండు. మరో మాట, మనుషులెవరైనా ఇటువైపు వస్తే వాళ్ళని పలకరించడానికి ప్రయత్నించకు. వాళ్ళు నిన్ను గమనించకుండాను, పలకరించకుండాను వెళ్ళిపోతే మట్టుకు ఆశ్చర్యపడకు!" అని వృద్ధుడు బయటకు వెళ్లి వెంకట్రావుడికి తెలియకుండా అంతర్ధానమయ్యాడు.

వృద్ధుడి అంతర్యమేమిటో అర్థంకాని వెంకట్రావుడు ఆ రోజల్లా అస్తవ్యస్తమైన ఆలోచనలతో కాలం గడిపాడు. పాకరాటకి కట్టిన మేకపిల్లకి పచ్చగరిక పీకి మేత పడేశాడు. తను నీళ్ళు తాగడానికి కాలువలోకి దిగినప్పుడల్లా దాని చేతా నీళ్ళు తాగించాడు. రాత్రి ఎనిమిదింటికల్లా వృద్ధుడు వచ్చాడు. వస్తూనే, "దీపం లేకుండా చీకట్లో కూర్చున్నావేం?" అని ప్రశ్నించాడు.

"నా దగ్గర అగ్గిపెట్టె లేదు" అన్నాడు వెంకట్రావుడు.

"పర్వాలేదులే, నా దగ్గరుంది" అంటూ వృద్ధుడు లాంతరు తగిలించిన రాట దగ్గరకు వెళ్ళాడు. లాంతర్ని ముట్టుకోగానే అది వెలిగింది. ఆ చీకట్లో ఏంచేసి వృద్ధుడు లాంతరు

వెలిగించాడో వెంకట్రావుడికి తెలియదు.

"ఆ కర్రతొట్టి పక్కన పారా, పలుగూ ఉన్నాయి. పైన చూరులో పట్టా కత్తి ఒకటుంది. ఆ మూడింటినీ తీసుకొని నాతోరా" అన్నాడు వృద్ధుడు లాంతరు పట్టుకుని వెలుతురు చూపిస్తూ.

వెంకట్రావుడు వాటిని తీసుకుని వృద్ధుని వెనకగా వెళ్ళాడు. వృద్ధుడు తులసి కోటకి దగ్గరగా ఆగాడు. "ఇదిగో, సరిగా యిక్కణ్ణుంచి అక్కడ వరకూ సుమారు ఆరడుగులు పొడుగూ, రెండడుగులు వెడల్పుగా తవ్వు" అని అజ్ఞాపించి తులసిగట్టు తిన్నె మీద కూర్చున్నాడు వృద్ధుడు.

వెంకట్రావుడు వేరు ఆలోచన లేకుండా తవ్వడం ప్రారంభించాడు. జీవితంలో ఎన్నడూ చెయ్యని పని. అయినా ఏదో చిత్రంగా వెంకట్రావుడుకి అలుపనిపించలేదు! ఓ రెండు గంటల తర్వాత, తవ్విన జాగాలో ఓ పొడువాటి పేటిక కనిపించింది. మొదటిసారిగా వెంకట్రావుడికి ఏదో అనుమానం వేసి వళ్లు జలదరించింది.

"నువ్వు వెళ్ళి ఆ మేకపిల్లని తీసుకువచ్చి ఈ జువ్విచెట్టుకి కట్టు" అన్నాడు వృద్ధుడు. వెంకట్రావుడు వెళ్లి, మొరాయిస్తున్న మేకపిల్లని బలవంతంగా లాక్కొని వచ్చి, జువ్విచెట్టు మొదట్లో దాన్ని కట్టాడు. తర్వాత వృద్ధుడు ఆదేశించిన ప్రకారం పేటిక మూతని పలుగుతో పెళ్ళగించేసరికి, నక్కల కూతలు భయంకరంగా వినిపించాయి. మేకపిల్ల గింజుకోవడం ప్రారంభించింది. గోతిలో ఉన్న దృశ్యం చూసి వెంకట్రావుడికి భయంతో స్పృహ తప్పేటంత పరిస్థితి ఏర్పడింది. అయినా వృద్ధుడు ఇచ్చిన భరోసాతో నిలదొక్కుకుని పరిశీలనగా చూశాడు.

లోపల ఓ స్త్రీ అస్థిపంజరముంది. గుండెగూడులో ఓ బాకు దిగబడి ఉంది. మెడలో మూడు వజ్రాల హారాలు, ఓ చంద్రహారం, ఒక్కొక్క చేతికి మూడేసి జతల వజ్రాలు పొదిగిన గాజులు, మొల చుట్టూ నవరత్నఖచితమైన వడ్డాణం, కాళ్ళకి కెంపులతో పొదగబడిన కడియాలు – ఇవి కాక ఆయా స్థానాల దగ్గర పడి ఉన్న చెవి కమ్మలు, ముక్కుపుడకలు. అయితే వీటన్నిటినీ మించిన నాగాభరణం – సజీవంగా ఆ అస్థిపంజరపు టెముకల్ని పెనవేసుకుని, బుసలు కొడుతున్న నల్లత్రాచు.

"ఆ పట్టాకత్తితో మేకపిల్ల తల నరికి రక్తాన్ని సర్పం మీద పడేటట్టు చెయ్యి. రుధిర శాంతితో అది గొయ్యి వదిలి వెళ్ళిపోతుంది. ఆ తర్వాత అభరణాలన్నింటినీ నీ స్వంతం చేసుకోవచ్చు!" అన్నాడు వృద్ధుడు.

"ఇటవంటిదేదో జరుగుతుందని కొద్దిగా అనుమానమొచ్చినా, ఇంతలా జరుగుతుందని ఊహించలేకపోయాను. మొదట్లోనే కనక తెలిస్తే ఈ పనికి పూనుకొనేవాణ్ణి కాను! మరొ హరి జాగాలో దొరికిన సొత్తుని కైవశం చేసుకోవడం భావ్యం కాదు!" అన్నాడు వెంకట్రావుడు.

"జాగా మరోహరిది కావచ్చు. కాని ఆ స్త్రీ నీ ముత్తాత భార్య! నీ తండ్రికి నాయనమ్మ! అంచేత ఆభరణాలు నీ సొత్తే! నగల కోసం ఆశించి ఆమె సోదరుడు, ఆమెని పుట్టింటికి తీసుకువెళ్తూ మార్గ మధ్యంలో, అంటే ఇక్కడ, ఆమెని హత్య చేసి, సద్దుమణిగిన తర్వాత నగలు తీసుకుపోవచ్చునన్న ఆశతో పాతిపెట్టాడు. అతని పథకం పూర్తికాక మునుపే, పాము

కాటు వల్ల మరణించాడు"

"ఎందుకో మీ మాటలు నమ్మబుద్ధి వేస్తోంది. జంతుబలి నాకు యిష్టం లేనిదీ, సాధ్యంకానిదీ. ఈ సొత్తుని వదులుకొంటాను కాని, ఆ పని మట్టుకు చెయ్యలేను!" అన్నాడు వెంకట్రావుడు.

"రక్తశాంతి జరిగితేనే కాని సర్పం తొలగదు. సరే, ఆ పని నేనే చేస్తాను?" అని వృద్ధుడు పట్టాకత్తి చేబట్టాడు. వెంకట్రావుడు మేకపిల్లని ఎత్తుకొని చేతుల్లో బంధించి హృదయానికి గట్టిగా హత్తుకొన్నాడు.

వృద్ధుడు వెంకట్రావుడి కేసి చూసి, "నువ్వీ బలికి ఒప్పుకోవు! సరే, నేనే ఏదో చెయ్యాలి" అంటూ ఎడమ అరచేతిని మణికట్టు వద్ద నరుకున్నాడు. ఆ అరచెయ్యి వెళ్ళి గోతిలో పడింది. వృద్ధుడి చెయ్యి నుంచి ఒక్క బొట్టు రక్తం కూడా కారలేదు! వెంకట్రావు సంభ్రమంగా చూస్తూ ఉండిపోయాడు.

"నా వంట్లో రక్తం లేదే, ఎలా?" అన్నాడు వృద్ధుడు.

వెంకట్రావుడు మేకపిల్లని కిందకు దించాడు. వృద్ధుడి చేతిలోని కత్తిని తీసుకుని, తన ఎడమ చేతి చిటికెన వేలుని మొదలంటా నరుక్కున్నాడు. అది వెళ్ళి గోతిలో ఉన్న అస్థి పంజరం గుండె గూడులో పడింది. ధారాపాతంగా ఎడమ చెయ్యి నుంచి కారుతోన్న రక్తంతో సర్పానికి అభిషేకం చేశాడు. నల్లత్రాచు అస్థిపంజరాన్ని వదిలి, గోతిలోంచి పైకి పాకి చీకట్లో కలిసిపోయింది.

వృద్ధుడి ఆదేశానుసారము వెంకట్రావుడు భయాన్ని పక్కకు నెట్టి, వేలు తెగిన బాధని పంటితో నొక్కి గోతిలోకి దిగాడు.

"నా తెగిన చెయ్యి అందించు, నీ తెగిన వేలుని నువ్వు తెగిన చోట అంటించుకో!" అన్నాడు వృద్ధుడు.

వెంకట్రావుడు అందించిన అరచెయ్యిని వృద్ధుడు మణికట్టు దగ్గర అతికించుకున్నాడు. వెంకట్రావుడు అస్థిపంజరం గుండె గూడులోంచి తన తెగిన వేలుని తీసి, తెగిన చోట పెట్టగానే అతుక్కుపోయింది! అంతవరకు ఉన్న బాధ ఒక్క క్షణంలో ఎగిరిపోయింది. వెంకట్రావుడు అటు పైన ఆభరణాల నన్నింటినీ ఒక్కటొక్కటిగా అస్థిపంజరం నుంచి తీసి గట్టున పెట్టాడు.

"ముత్తవ్వా, థాంక్స్!" అంటూ వెంకట్రావుడు అస్థిపంజరానికి నమస్కరించి, పైకి వచ్చి గొయ్యి పూడ్చివేశాడు.

"ఈ నగలు తీసుకుపోయి, హైదరాబాద్‌లో వజ్రాల వ్యాపారులకమ్మి సొమ్ము చేసుకో. వాస్తునియమాల్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ ఓ హోటలు కట్టు. నీ వ్యాపారం దిగ్విజయంగా సాగుతుంది. వచ్చే లాభాన్ని అనాథశరణాలయాల కోసం, ఇతర సాంఘిక ప్రయోజనాల కోసం వినియోగించు. నువ్వు మట్టుకు అడంబరాలకి పోకుండా సాదా జీవితం గడుపు. నీకు సుఖశాంతులు లభిస్తాయి. నా పనైపోయింది, వస్తామరి" అన్నాడు వృద్ధుడు.

"నా మీద యింతటి అపారమైన కనికరం చూపిన మీరెవరు స్వామీ?" – వెంకట్రావుడు

చేతులు జోడించి నమస్కరిస్తూ అడిగాడు.

"నేనా? నీ ముత్తవ్వను చంపిన, ఆమె సోదరుణ్ణి! పశ్చాత్తాపంతో భూమ్మీదే తిరుగాడుతున్న ఆత్మని! పైశాచికత్వం వదిలి, ఈరోజు నా ఆత్మ శుద్ధి పొందింది. నేను చెప్పిన మాటలు మటుకు మరిచిపోకు, ఉంటాను" అంటూ వృద్ధుడు వెంకట్రావుడిని దీవించి, ఈమారు వెంకట్రావుడు చూస్తుండగానే వెళ్ళి తులసి కోటలోకి కలిసిపోయాడు. తులసి కోట బీటలు వారి బ్రద్దలయింది. అందులోంచి ఓ తెల్లని, చల్లని మేఘం ఆకాశం వైపు వెళ్లిపోతూ కనిపించింది వెంకట్రావుడికి.

• • •

'ఫ్రెండ్లీ ఘోస్ట్ – ది వెజిటేరియన్' హోటలు నిర్మాణదశ నుంచీ పత్రికల కెక్కింది. వాస్తు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని వాస్తుశాస్త్రజ్ఞులు ఎలుగెత్తి ఘోషించారు. పేపర్లలో ప్రకటనలు వేసి, హోటలుకి కావలసిన సిబ్బందిని స్వయంగా ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేశాడు. ఒక గొప్ప మెజీషియన్‌ని చాలా ఎక్కువ పారితోషికమిచ్చి, ప్రతి రాత్రి పన్నెండు గంటలకి డైనర్స్‌కి వినోదం కల్పించే ఏర్పాటు చేశాడు.

ప్రారంభోత్సవం చాలా అట్టహాసంగా జరిగింది. పారిశ్రామిక అధినేతల్ని, రాజకీయ నాయకుల్నీ, టీవీ సినిమా స్టార్స్‌నీ, పత్రికా విలేఖర్లన్నీ అహ్వానించాడు. అత్యంత ఆధునికంగానూ, అహ్లాదకరంగాను ఉన్న డైనింగ్ హాల్లో, వీనులవిందుగా మంద్రస్థాయిలో సంగీతం వినవస్తోంది. అందరికీ రాత్రి పదకొండూ ఏభై అయిదు కల్లా రకరకాల వెజిటేబుల్ సూప్స్ సర్వ్ చెయ్యబడ్డాయి. వేడి వేడిగా. వాటిని కొద్ది కొద్దిగా రుచి చూసి, "అద్భుతం!" అన్నారందరూ ఏకగ్రీవంగా.

అంతలో మెజీషియన్ డైనింగ్ హాల్‌లోని ఓ పక్కగా వున్న వేదిక మీదకు వచ్చి "హాయ్!" అన్నాడు. దీపాలు మందకొడిగా మారాయి. ఆ తర్వాత ఊదా రంగులోకి మారాయి. హాలు చీకటి చీకటిగా తయారయింది. అంతవరకూ మనోహరదృశ్య చిత్రీకరణ ఉన్న గోడల మీద గోరీలు, మండుతున్న చితిమంటలూ కనబడ్డాయి! శ్రావ్యమైన సంగీతం మాయమై నక్కల అరుపులూ, తీతువు కూతలూ వినిపించసాగాయి. కొంతమంది భయంతో బిగుసుకుపోయారు.

'ఛ! యిది టోమాటో సూపు కాదు, నల్లి రక్తంలా ఉంది!' – ఎవరో అరిచారు. అందరూ అటువైపు తిరిగి చూశారు. ఆ టేబుల్ దగ్గర పిశాచం మొహంతో నిలబడ్డ ఓ వెయిటర్, "ఏదీ, నన్ను చూడనివ్వండి", అంటూ ఆ బౌల్ తీసుకుని గడగడా తాగేసి, 'ఇంత కమ్మగా ఉంటే నల్లి రక్తంలా ఉందంటారేమిటి?" అన్నాడు కఠోరమైన స్వరంతో.

"నా సూప్‌లో బల్లి కదుల్తోంది – అయ్యబాబోయ్ నా సూప్‌లో మనిషి బ్రొటన వేలుంది– ఈ సలాడ్ పళ్ళెంలో నల్ల తేలు పాకుతోంది – బాబోయ్, నా పక్కన ఏదో దెయ్యం కూర్చుంది"– ఇలా హాలంతా గగ్గొలెత్తిపోయింది.

మెజిషియన్, "హాయ్, హాయ్" అన్నాడు. వెంటనే హాలు దేదీప్యమానంగా వెలిగిపోయింది. డైనింగ్ హాలు మొదట్లో ఉన్నట్టుగా మనోహరంగా ఉంది. మధురమైన సంగీతం వినిపించసాగింది.

మొహాలకి తొడుక్కున్న పిశాచం ముసుగులు తీసి, వెయిటర్లు హాయిగా నవ్వారు. జనాలు శ్వాస పీల్చుకున్నారు. ఆపైన ఆనందోద్రేకాలతో చప్పట్లు కొట్టారు.

"మీరు భయపడవలసిన అవసరం లేదు. మీరు పొందిన ఈ కొద్ది క్షణాల థ్రిల్ లేదా అనుభూతి కొంత నా మేజిక్ ద్వారా, కొంత లేజర్ కిరణాల ద్వారా, కొంత వెయిటర్ల వేషధారణ వల్లా కలిగించబడింది. ఈ ప్రత్యేమైన అనుభూతి రోజుకోలా పొందాలంటే, మా హోటలును రాత్రి పదకొండు దాటిన తర్వాత వీలైనన్నిసార్లు మీ బంధుమిత్రులతో వచ్చి సందర్శించండి. ఆ ఒకటి రెండు నిముషాలు తప్ప మిగిలిన సమయాల్లో మా హోటలు మీరిప్పుడు చూస్తున్నట్లుగానే ఉంటుంది. మరో సంగతి మరచిపోవద్దు. ఈ హోటల్లో వంటకాలన్నీ స్ట్రిక్ట్ వెజిటేరియన్! హాయిగా డిన్నర్ ముగించండి" అన్నాడు మెజీషియన్.

మరోమాటు చప్పట్లు మారుమోగాయి.

⁂

'ఫ్రెండ్లీ ఘోస్ట్ హోటలు' రూం నెంబరు 666లో ఓ పెద్ద కంపెనీ మేనేజింగ్ డైరెక్టరయిన ప్రశాంత్, తన సెక్రటరీ ప్రియురాలి కోసం అసహనంగా ఎదురు చూస్తున్నాడు. అంతలో తలుపు తోసుకుని వసంత ప్రవేశించింది. "ఇంట్లో అందరి కన్నూ కప్పి రావడంలో ఆలస్యమైంది డియర్!" అంటూ అతని పెదాలందుకొంది. వసంత ప్రశాంత్‌కి అమరసుఖాన్నందజేసి బాత్‌రూంలోకి వెళ్ళింది. ప్రశాంత్ తృప్తిగా టీవీ కేసి చూస్తుండగా తలుపు తట్టిన శబ్దం వినిపించింది. నైట్‌గౌన్ దగ్గరగా లాక్కొని, వెళ్లి తలుపు తీశాడు. ఎదురుగా వసంత!

"సారీ డియర్! ఇంట్లో అందరి కన్నూ కప్పి రావడంలో ఆలస్యమైంది" అంటూ లోపల అడుగు పెట్టింది. వాస్తవానికి రూం నెంబరు 333లో ప్రశాంత్ పార్ట్‌నర్ ముఖేష్‌తో సాయంత్రం నుంచీ గడిపి వచ్చింది.

"నువ్వు... నువ్వు... బాత్‌రూం?...." ప్రశాంత్‌కి ఆశ్చర్యంతో మాటరాలేదు.

"నువ్వు కూడా రా మహానుభావా! ఇద్దరమూ కలిసి షవర్‌బాత్ చేద్దాం" అంటూ వసంత ప్రశాంత్‌ని బలవంతంగా బాత్‌రూంలోకి తీసుకుపోయింది. బాత్‌టబ్ అంచు మీద కూర్చున్న మరో వసంత కనబడింది.

"నువ్వు.... నువ్వు....?" వసంత విభ్రమంగా ప్రశ్నించింది.

"నేను నువ్వు కాదు! నేను కోమల్ని!" అంటూ, బాత్‌టబ్ మీద కూర్చున్న వసంత కోమలగా మారిపోయింది. పసుపుపచ్చని మొహం, చింతనిప్పుల్లాంటి కళ్ళు, విరబోసిన జుట్టు, పెద్ద రూపాయంత బొట్టు, నల్లని చీర! "బ్రతికే ఉన్నానుకొంటున్నారా? మీరిద్దరూ కలిసి చంపిపారేసిన తర్వాత బ్రతికెలా ఉంటానూ?" - కోమల ఎగిరి సీలింగ్‌లోకి మాయమైంది! బాత్‌టబ్ ముక్కలయింది. వసంతా, ప్రశాంత్ గుండెలు పట్టుకొని నేల కొరిగి పోయారు. కోమల మళ్ళీ వసంత రూపంలో వెళ్ళి, రూం నెంబరు 333 ముందు నిల్చుని తలుపు తట్టింది.

⁂

నిద్ర రాక బేస్‌మెంట్ కారిడార్లో తచ్చాడుతున్న వెంకట్రావుడికి ఏవో మాటలు వినిపించి, ఓ కిటికీలోంచి కార్ పార్క్ ఏరియాలోకి చూశాడు. మెజీషియన్ అందర్నీ ఉద్దేశించి అంటున్నాడు.

"... ఈ హోటలు కట్టిన తర్వాత మనకి అయిదు సంవత్సరాలు హాయిగా గడిచి పోయింది. ఈనాడు మనకు తెలియకుండా బయట నుంచి వచ్చిన ఓ కొత్త దెయ్యం కోమల చేసిన ప్రతీకారచర్య వల్ల, ఇదే హోటల్లో బస చేసిన ప్రశాంత్, అంటే కోమల భర్త, అతగాడికీ, అతని పార్ట్‌నర్ ముఖేష్‌కి - ఇద్దరికీ ప్రియురాలిగా నటించిన వసంతా, ముఖేష్-ముగ్గురూ గుండాగి మరణించారు. కోమల హత్యలో ఈ ముగ్గురికీ భాగముంది. పోలీసులు వచ్చి విచారణ మొదలుపెడ్తే, మనమందరమూ చచ్చిపోయిన వాళ్ళమే అని తెలిసిపోతుంది! ఈ హోటలు మూతపడితే, అదృశ్యంగా, అజ్ఞాతంగా మనం అందచేస్తున్న మన జీతాలూ, ప్రత్యక్షంగా వెంకట్రావుడు అందచేస్తున్న హోటలు మీద వచ్చిన లాభాలూ అనాథ శరణాలయాలకి అందక, అవి అధ్వాన్నపరిస్థితిలోకి దిగజారిపోతాయి! 'పుణ్యకార్యాలు చేసి మీ ప్రేతాత్మలకు ముక్తి కలిగించుకోండి' అని చెప్పిన వృద్ధుడి ఆదేశం ప్రకారం మనం ఈ హోటల్లో మానవ రూపాలు ధరించి శ్రమపడ్డ ఫలితంగా, ఇంతవరకూ ఇరవై ఆత్మలకి ముక్తి కలిగింది! కోమల తెలివి తక్కువతనం వల్ల మనందరమూ ఇబ్బందిలో పడకుండా మాయమైపోయినా, వెంకట్రావుడు చికాకుల్లో పడిపోతాడు. సర్లెండి. మీరు జాగ్రత్తగా వ్యవహరించండి. వెంకట్రావుడికి, ఈ హోటలుకీ పేరు పోకుండా ఉపాయం ఆలోచిస్తాను!"

'ఓర్నీ! నా హోటల్లో పనిచేసేవాళ్ళు దెయ్యాలన్న మాట! వృద్ధుడు వాస్తుకి విరుద్ధంగా హోటల్ని ఎందుకు కట్టమన్నాడో యిప్పుడర్థమైంది!' అనుకొన్నాడు వెంకట్రావుడు. వాస్తు పక్షంగా ఉన్న భవనాల్లో నరపిశాచాలకే తప్ప మృతపిశాచాలకు తావు లేదు.

⚬ ⚬ ⚬

"నాన్సెన్స్, కల్నల్ రామ్‌చంద్! మీరు వెంకట్రావుడుగారిని గురించి కట్టుకథ చెబ్తున్నారు! వెంకట్రావుడుగారూ, మీరు ముసిముసి నవ్వులు నవ్వుతూ ఆయన చెప్పేదంతా విని ఎలా సహిస్తున్నారో నా కర్థం కావట్లేదు?!" అన్నాడు కల్నల్ రాజారావు.

వెంకట్రావుడు తన ఎడం చేతికి తొడుక్కున్న గ్లవ్ తీసి, అరచెయ్యిని చూపించాడు.

"ఆ రోజు, నరుక్కొన్న చిటికెన వేలుని తిరిగి అతికించుకోమని వృద్ధుడు చెప్పినప్పుడు, ఆ కంగారులో తిరగేసి అతికించుకొన్నాను చూడండి!" అన్నాడు.

చిటికెనవేలు, గోరు ఉన్న వైపు అరచేతి వైపు ఉంది! వెంకట్రావుడు వేళ్ళు ముడిచాడు. మిగిలిన నాలుగు వేళ్ళూ అరచేతిలోకి ముడుచుకొంటే, చిటికెన వేలు వెనక్కి ముడుచుకొంది!

⚬

*(రెండేళ్ళ క్రితం 'ది హిందూ' పేపర్ 2వ పేజీలో, కళేబరం దుస్తులూ, కపాలం ముసుగులూ ధరించిన వెయిటర్లతో ఓ రెస్టారెంట్ కాస్త భయానకమైన వినోదం కలిగించిందన్న వార్త చదివిన గుర్తు. ఆ స్పార్క్‌తో ఈ అభూత కల్పన, ఓ చిన్న ఎక్స్‌పరిమెంట్ - రచయిత)*